ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యేలు చంటి, ప్రభాకర్, రీజనల్ ఆర్టీసీ చైర్మన్ అప్పలనాయుడు

అంబేడ్కర్ మార్గంలో పయనించండి

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్
- అంబేడ్కర్‌కు ఘన నివాళులు

ఏలూరు/ఏలూరు టూటౌన్/ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనించేందుకు ప్రతీ ఒక్కరు పునరంకితమవ్వాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. ఏలూరు పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ 134వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని వికసిత భారత్, స్వర్ణాంధ్ర కలల సహకారానికి పాటు పడాలన్నారు. ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, డిప్యూటీ మేయర్ ఉమామహేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.విక్రమ్ కిశోర్, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్ తదితరులు పాల్గొన్నారు.



• కలెక్టరేట్‌లో..

మహోన్నత వ్యక్తి, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశేష కృషి చేశారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు విజయవాడ రీజనల్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, పలువురు దళిత నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాశ్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, దళిత నాయకులు నేతల రమేశ్ బాబు, పొలిమేర హరికృష్ణ, మెండెం సంతోశ్ కుమార్, బయ్యారపు రాజేశ్వరరావు, మేతర అజయ్ బాబు, కందుల రమేశ్ పాల్గొన్నారు. నగరంలోని పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఇన్‌చార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి నివాళులర్పించారు.



• జిల్లా పోలీస్ కార్యాలయంలో..

వ్యక్తిలో ప్రతిభ ఉంటే అందరిలోనూ గుర్తింపు వస్తుందని అనడానికి నిదర్శనమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్పీ కేపీఎస్ కిషోర్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీటీసీ డీఎస్పీ ప్రసాదరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

విరిగిపడ్డాయి..

భారీవర్షం..భీకర గాలుల బీభత్సం

- వరి, అరటి, మొక్కజొన్న పొగాకు పంటలకు తీవ్ర నష్టం
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- కైకలూరు నియోజకవర్గంలో 160 విద్యుత్ స్తంభాల ధ్వంసం
- తాటిచెట్టు కూలి మహిళకు తీవ్ర గాయాలు

కైకలూరు/ముసునూరు/కలిదిండి/ముదినేపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. కైకలూరు మండలంలో ఎక్కడికక్కడే రహదారులపై వందలాది చెట్లు విరిగిపడగా, ఆక్వా చెరువులపైన వందలాది కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో కైకలూరు అంధకారంగా మారింది. కైకలూరులో చిన్నమసీదు వెనక, కాల్వ గట్టుపై భారీ చింతచెట్టు పంట కాల్వలోకి విరిగిపడగా అక్కడున్న కరెంటు స్తంభాలు నేల కొరిగాయి. వదర్లపాడు, అగ్రహారం, రాచపట్నం, గోపవరంలో సోమవారం రాత్రి కూడా విద్యుత్‌ను పునరుద్ధరించలేదు. కైకలూరు నియోజకవర్గంలో సుమారు 160 కరెంటు స్తంభాలు ధ్వంసం కాగా కైకలూరు మండలంలోనే 40 స్తంభాలు విరిగిపడ్డాయి. పదుల సంఖ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కైకలూరు రైల్వేస్టేషన్ నుంచి పంచాయతీ ఆఫీసుకు వెళ్లే రోడ్డులో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై నుంచి నేలపైకి విరిగిపడగా అదే రోడ్డులో నాలుగు చోట్ల భారీచెట్లు విరిగిపడ్డాయి. కైకలూరు వైఎస్సార్ కాలనీలో పలు ఇళ్లపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. కైకలూరు రాజగోపాల్ ఫిల్లింగ్‌స్టేషన్లో పెట్రోలు పంపుసెట్లు ఈదురుగాలులకు కిందపడింది. పలు ఇళ్లపై సోలార్ ప్లేట్లు, పలు అపార్ట్‌మెంట్లకు, భారీ భవంతులకు ఏర్పాటు చేసిన అద్దాల గ్లాసులు ధ్వంసమయ్యాయి. కైకలూరు రైల్వేస్టేషన్లో ఈదురుగాలులకు చెట్లు కూలడంతో పలు రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. విజయవాడ-నరసాపూర్ ప్యాసింజర్ రైలు 4 గంటలు, తిరుపతి-పూరి రైలు 3.30 గంటలు ఆలస్యమైనట్లు స్టేషన్ మాస్టర్ జిలానీ తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని ద్విచక్రవాహనాల పార్కింగ్ షెడ్డుపై చెట్టు కూలిపోవడంతో పలు బైక్‌లు ధ్వంసమయ్యాయి. పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారిపై వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద భారీ వృక్షం రోడ్డుపై పడిపోగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడాయి. కైకలూరు టౌన్ పోలీసులు, ఆటపాక పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చెట్లను తొలగించారు.

కలిదిండి మండలం కోరుకొల్లులో ఆదివారం సాయంత్రం మేకా ఆదిలక్ష్మి (38) ఇంటి ఆవరణలో వంట పాత్రలు కడు గుతుండగా ఆకస్మాత్తుగా వీచిన గాలులకు తాటిచెట్టు కూలి మీద పడడంతో తీవ్రంగా గాయపడింది. కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో విజయ వాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



కైకలూరులో విరిగిపడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్





కొవ్వలిలో ధాన్యం రాశుల కిందకు చేరిన నీరు తొలగిస్తున్న రైతు



కైకలూరులో విరిగిన విద్యుత్ స్తంభం



కైకలూరు చిన్నమసీదు వెనుకాల పంటకాల్వ గట్టుపై నేలకొరిగిన భారీ చింతచెట్టు

ముసునూరు మండలం లో అక్కిరెడ్డిగూడెం, గోగులంపాడు, ముసునూరు తదితర గ్రామాల్లో అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాట్రేనిపాడులో బడిపాటి సాంబయ్య, గద్ద మోహన్‌రావు అరటి పంట నేల కొరిగింది. ముదినేపల్లి మండలం అల్లూరులో పంతగాని నాగరాజుకు చెందిన తాటాకింటిపై తాటిచెట్టు పడడంతో పాక్షికంగా దెబ్బతింది. అదే గ్రామంలో ప్రధాన విద్యుత్ లైన్లపై తాటి చెట్టు కూలిపోగా వైర్లు తెగిపోయాయి.



కైకలూరు పెట్రోలు బంకులో నేలకొరిగిన పంపుసెట్టు

అకాల వర్షాలు.. అపార నష్టం

వేలేరుపాడు : అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే దశలో అకాల వర్షాలు కురవడం వలన కోతకొసిన పంటలు, పొలాల్లో ఉన్న పంటలు, దెబ్బతింటున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా మండలంలో రైతులు సాగు చేసిన పొగాకు, మిర్చి తడిచిపోయాయి. మండలంలో దాదాపు మూడు వేల ఎకరాల్లో మిర్చి, వెయ్యి ఎకరాల్లో పొగాకు పంటలను సాగు చేశారు. సుమారు వెయ్యి ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. నాణ్యమైన పొగాకుకు క్వింటాకు రూ.22 వేలు చెల్లించేలా ప్రైవేటు పొగాకు కంపెనీ యాజమాన్యాలతో ఒప్పందం చేసుకున్న రైతులు పొగాకు పంట తడిచిపోవడంతో ధర విషయంలో ఆందోళన చెందుతున్నారు.

సెలవులో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యక్తిగత కారణాల రీత్యా సెలవు పెట్టారు. ఆమె ఈనెల 17 వరకు సెలవులో ఉంటారు. సీఎం చంద్రబాబు నూజివీడు పర్యటన అనంతరం ఆమె శనివారం నుంచి జిల్లాలో లేరు. ఈనెల 18న విధుల్లో చేరనున్నారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. అంతవరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ పి.ధాత్రిరెడ్డి వ్యవహరించనున్నారు.



ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేస్తున్న జీఆర్పీ ఎస్ఐ సైమన్, సిబ్బంది

ఏలూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రైల్వే స్టేషన్‌లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో సిబ్బందితో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. విశాఖ నుంచి రాత్రివేళ వస్తున్న ఒక రైలు బోగీలో ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేశారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం అందడంతో ఈ తనిఖీలు నిర్వహించారు. అయితే ఎలాంటి అక్రమ రవాణాలు లభించలేదు. ఈ తనిఖీలు కొనసాగిస్తామని ఎస్ఐ సైమన్ తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్టు జిల్లా అగ్నిమాపక అధికారి సీహెచ్ రత్నబాబు తెలిపారు. ఏలూరు అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈమేరకు స్మారకదినం సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద ఆయన నివాళులర్పించారు. వారోత్సవాలకు సంబంధించిన, అగ్నిమాపక నిరోధక చర్యలపై ముద్రించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లు ఆయన విడుదల చేశారు. ఏలూరు కేంద్ర అగ్నిమాపక అధికారి వి.రామకృష్ణ, ఏలూరు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలో ప్రదర్శించిన స్టాల్స్‌ను సందర్శించి వాటి ఉపయోగాలను వివరించారు.



అగ్నిమాపక వారోత్సవాల్లో పాల్గొన్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది



జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

ఏడేళ్లుగా వంతెన కష్టాలు!

- జల్లేరు వాగుపై అసంపూర్తిగా పట్టెన్నపాలెం బ్రిడ్జి
- టెండర్లు పిలిచినా స్పందించని కాంట్రాక్టర్లు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై బ్రిడ్జి పనులు ప్రారంభమై ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బ్రిడ్జి అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.ఐదు కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే పీతల సుజాత శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభించారు. పిల్లర్లు నిర్మించి వాటికి స్లాబ్‌లు వేశారు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్రిడ్జి పనులను పట్టించుకోలేదు. బ్రిడ్జి పూర్తవక ఏజెన్సీ, మెట్ట ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'రూ.3.2 కోట్లతో వంతెన నిర్మాణ పనులకు టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదు. రెండోసారి టెండర్లు పిలుస్తాం. ఒకవేళ బ్రిడ్జి పనులను ప్రారంభించినా రెండేళ్లు పడుతుంది.అప్పటి వరకు ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టెన్నపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పక్క నుంచి కాజ్‌వే నిర్మాణం కోసం రూ.80 లక్షలు మంజూరు చేసింది. త్వరలో పనులను ప్రారంభిస్తా'మని ఆర్అండ్‌బీ డీఈఈ సీహెచ్.హరికృష్ణ తెలిపారు.

■ లోపలి పేజీలో..

టోల్ ఫీజు తప్పించుకునేందుకు..
నాచుగుంట వద్ద ప్రమాదాల బారిన పడుతున్న వాహనాలు



పసిడి పరుగులు
- రూ.లక్షకు చేరువలో బంగారం
- పది గ్రాముల బిస్కెట్ రూ.94,200
- ఆర్నమెంట్ ధర రూ.86,650

శ్రీనివాసుని కల్యాణం చూతము రారండి..
20 నుంచి లక్ష్మీపురంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు

గాలికొదిలేశారు!

అధ్వానంగా నగరంలోని పార్కుల నిర్వహణ

- పచ్చదనం కరువు.. శిథిలమవుతున్న సామగ్రి
- గార్డినర్స్ పత్తా ఉండరు
- అధికారులు పట్టించుకోరు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని 25 పార్కుల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. పచ్చదనాన్ని ప్రతిబింబించాల్సిన పార్కులు ఆదరణ కరువై అధ్వానంగా మారాయి. చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు అక్కరకు రాకుండా పోయాయి. గార్డినర్లు పార్కుల్లో ఉండరు. అధికారులు పట్టించుకోరు. రికార్డుల్లో పార్కుల నిర్వహణకు రూ.లక్షలు ఖర్చు చేసినట్టు చూపినా ఇక్కడ చూస్తే అభివృద్ధి కనిపించదు.

ఒకవైపు ఎండలు ముదురుతున్నాయి. పగలంతా ఇళ్లల్లో ఉక్కబోత, చెమటతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాయంకాలం సమయంలో సేద తీరాలంటే పార్కులకు వస్తే అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణమే కానరావడం లేదు. దీంతో నగరవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఆర్ఆర్.పేట మున్సిపల్ పార్కు ప్రధానమైంది. ఇక్కడ మెయిటినెన్స్ సరిగా ఉండదు. ఇక్కడ గార్డినర్ పర్మినెంట్ ఉద్యోగికి రూ.50 వేలకు పైగానే జీతం ఉంటుంది. ఇక్కడ ఆమె విధులు సరిగా నిర్వహించద్దని, రూ.6వేలు ఇచ్చి ప్రైవేటు వ్యక్తుల్ని నియమించుకున్నట్టు ఆరోపణలున్నాయి. దీనిపై ఇటీవల ఉన్నతాధికారులు ఆమెను పిలిచి హెచ్చరికలు జారీ చేశారు. అశోక్‌నగర్ పార్కులో వేలాది రూపాయలతో జిమ్ ఏర్పాటు చేశారు. వాటి మెయింటినెన్స్ సరిగాలేక అన్ని పాడైపోయాయి. తుప్పుపట్టి విరిగిపోతున్నాయి. అధికారులు వాటివంకే చూడరు. అక్కడ గార్డెనర్ ఎవరూ కనిపించరు. టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జన్మభూమి పార్కు దారుణంగా మారింది. రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. కలెక్టరేట్ వెనుక ఉన్న జన్మభూమి పార్కు కూడా ప్రేమజంటలకు నిలయంగా మారింది. నగరంలో దాదాపు అన్ని పార్కుల పరిస్థితి ఇలానే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని పార్కుల నిర్వహణ బాధ్యతగల అధికారులకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వేసవిలో నైనా పార్కుల్లో సేద తీరేందుకు అనువైన వాతావరణం కల్పించాలని నగరవాసులు కోరుతున్నారు.



జన్మభూమి పార్కులోని వాటర్ ఫౌంటేన్ దుస్థితి



అశోక్ నగర్‌లో రాజీవ్‌గాంధీ పార్కు



టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జన్మభూమి పార్కు



శ్రీనివాసుని కళ్యాణం చూతము రారండి..

20 నుంచి లక్ష్మీపురంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు

23న రాత్రి స్వామి వారి తిరుకల్యాణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శతాబ్ధాల కాలం నాటి పురాతన చరిత్ర కలిగి, లక్ష్మీపురం గ్రామంలో వెలుగొందుతున్న సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో ఏడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీనివాసుని పెండ్లికుమారునిగా పద్మావతి, అండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవ ప్రారంభానికి శ్రీకారం చుడతారు. ఈనెల 21న స్వామివారి కల్యాణానికి సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో అర్చకులు ధ్వజారోహణ జరుపుతారు. 23న రాత్రి 8గంటలకు ఉభయదేవేరులతో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ ఆవరణలోని కల్యాణ వేదిక వద్ద నిర్వహిస్తారు. 24న సమీప గ్రామమైన తిమ్మాపురం వరకూ గరుడ వాహనంపై కొలువుదీరిన కల్యాణమూర్తులు ఊరేగుతారు. 25న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజ అవరోహణ జరుగనున్నాయి. 26 రాత్రి జరుగనున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవు తాయని ఈవో మూర్తి వివరించారు.

ఆలయ ప్రత్యేకత



ఒకే ఆలయగోపుర గర్భాగంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లతో పాటుగా జగన్నాథస్వామి, బలరామ, సుభద్రదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత. పచ్చదనంతో పాటు ఆహ్లాదాన్నిచ్చే ఆలయ పరిసరాలు భక్తులను ఆహ్లాద పరుస్తాయి. శ్రీవారి క్షేత్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న ఈ ఆలయాన్ని శతాబ్దన్నర క్రితం ఒడిశా రాష్ట్రానికి చెందిన మంత్ర రత్నం అమ్మాజీ తన ఇలవేల్పు శ్రీనివాసుని ఆలయాన్ని నిర్మించారు. ఆమె పూరీ మఠాధిపతులు కావడంతో జగన్నాథస్వామిని ప్రతిష్ఠించారు. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరడంతో 1992లో శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని జీర్ణోద్ధరణ జరిపి ప్రతీ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తోంది.



జగన్నాథస్వామి, బలరామ, సుభద్ర

కోడికి మేత భారం

భారీగా పెరిగిన మొక్కజొన్న, సోయాబీన్



తణుకు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతులకు పెను భారంగా మారిన మొక్కజొన్న. ధర భారీగా పెరిగింది. దీంతో పెరిగిన మేత ధరలతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పౌల్ట్రీ కోళ్లకు మేతలో ప్రధానంగా వాడే మొక్కజొన్నతో పాటు, సోయాబీన్, నూకల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆరు నెలలు నుంచి ధరలు అమాంతంగా పెరిగి పోయాయి. దీంతో పౌల్ట్రీ రైతులు కోళ్ల మేతలకు అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలల నుంచి మొక్కజొన్న, నూకలు ధరలు భారీగా పెరిగాయి. క్వింటా మొక్కజొన్న రూ.1800 నుంచి ఇపుడు 2,600 లకు పెరిగింది. సీజన్‌లో అయితే ఏకంగా రూ.3,200 వరకు పెరిగింది. నూకలు కూడా రూ.1,800 నుంచి 2,500 వరకు పెరిగింది. ధరలు పెరిగినప్పటికి రైతులకు కావాల్సిన మొక్కజొన్న, నూకలు కూడా అతి కష్టం మీద కొనుగోలు చేసుకొనే పరిస్థితులు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది రైతులు పండిస్తుంటారు. అయితే పండిన పంటను రైతులు విత్తనాలు రూపంలో అమ్మకాలు చేయడం వల్ల మొక్కజొన్నకు గిరాకీ ఏర్పడినట్లు చెబుతున్నారు. నూకలు అందుబాటులో ఉన్నప్పటికి అవి బీర్లు తయారీలో వినియోగించడం వల్ల తమకు దొరకడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. ఇక మేతలో వినియోగించే సోయాబీన్ కూడా ఇటీవల క్వింటా ఏడువేలు వరకు పెరిగింది. క్వింటా రూ.30 వేలు నుంచి రూ.40 వేలు వరకు పెరిగింది. ఒక్కసారిగా పదివేలు వరకు పెరిగింది. ఇప్పటికి రైతులు దానాలకు అవసరమైన మొక్కజొన్న, నూకలు కొరతను దృష్టిలో ఉంచుకుని, కొనుగోలు చేయాలని భావించినప్పటికి అవసరమైన సరకు సరఫరాలో తీవ్ర జాప్యం ఏర్పడుతుంది.


ప్రభుత్వం రాయితీ కల్పించాలి



పౌల్ట్రీ రైతులకు అవసరమైన మొక్కజొన్న, నూకలు వంటి వాటిపై ప్రభుత్వం రాయితీ కల్పించాలి. పరిశ్రమ చాలా ఒడిదుడుకుల నుడమ కొనసాగిస్తున్నాం. నిర్వహణ భారం ఎక్కువ అవ్వడం వల్ల ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలి. పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి.

- మల్లిన శ్రీనివాసరావు, గోదావరి నెక్ జోన్ చైర్మన్

పసిడి పరుగులు



రూ.లక్షకు చేరువలో బంగారం

పది గ్రాముల బిస్కెట్ రూ.94,200

ఆర్నమెంట్ ధర రూ.86,650

నరసాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పసిడి ధర తగ్గేదేలే అంటున్నది. స్వల్పంగా తగ్గినా..మళ్లీ పెరిగింది. సోమవారం పది గ్రాముల బిస్కెట్ బంగారం రూ.94,200 పలకగా ఆర్నమెంట్ బంగారం రూ.86,650కి చేరింది. ఈ లెక్కన గ్రాము అర్నమెంట్ బంగారం కొనాలంటే రూ.8,660, అదే బిస్కెట్ బంగారం రూ.9,420 చేతిలో ఉండాల్సిందే. గత ఏడాది వరలక్ష్మి వ్రతం పండుగ రోజున గ్రాము ఆర్నమెంట్ బంగారం రూ.6,500 పలికింది. అదే సమయంలో బిస్కెట్ ధర రూ.7,200 ఉంది. కేవలం ఆరు నెలల్లోనే గ్రాముకు రూ.2 వేలు పైనే పెరిగింది. ఈ ఏడాది ఆరంభంలో పసిడి ధర భారీగా పెరగవచ్చునని అంచనా వేశారు. డిసెంబర్ నాటికి పది గ్రాముల బంగారం రూ.లక్షకు చేరుతుందని భావించారు. అయితే ఏడాది ఆరంభమే నాలుగు నెలలు కాకుండానే ధర రూ.లక్ష వైపు పరుగులు తీస్తుండటంతో వినియోగదారులు బులియన్ మార్కెట్ వైపు చూసేందుకు సంకోచిస్తున్నారు. ధర ఇదే విధంగా పెరిగితే మే నాటికి గ్రాము బిస్కెట్ రూ.10 వేలు పలకవచ్చునని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్నమెంట్ కూడా గ్రాము రూ.9 వేలకు చేరుతుందని అంచనా కడుతున్నారు. పసిడి ధర పెరుగుదలకు అనేక కారణాలు చూపి స్తున్నారు. అమెరికా అధ్యక్షుడు విధించిన సుంకాలతో స్టాక్ మార్కెట్‌లు కుదేలయ్యాయి. అక్కడ ప్రభుత్వం జారీ చేసే బాండ్ ధరలు తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో ఆర్థిక మాంద్యం వస్తుందన్న భయంతో చాలామంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు. ఈ కారణంగానే ధర దిగి రావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఒక్కసారిగా పడిన అమ్మకాలు

ధర ప్రభావం జిల్లాలో అమ్మకాలపై చూపింది. ప్రస్తుతం సీజన్ అయినప్పటీ అమ్మకాలు మాత్రం అంచనాకు మించి లేవు. ధర తగ్గుముఖం పట్టవచ్చన్న అభిప్రాయంలో విని



యోగదారులు ఉన్నారు. ఈ కారణంగా ఈ ధరలో కొనేందుకు ఎవరూ షాపులకు వెళ్లడం లేదు. దీంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. రోజుకు రూ.50 లక్షలు అమ్మే పెద్ద దుకాణం రూ.10 లక్షలు కూడా అమ్మకాలు జరపడం లేదు. సాధారణంగా ఈ సీజన్‌లో రోజుకు రూ.10 నుంచి రూ.20 కోట్లు వరకు జిల్లాలో వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం అమ్మకాలు రూ.5 కోట్లు కూడా మించడం లేదని సమాచారం.

ఆయనకు పండ్లంటే పిచ్చి.. తినడంలో కాదండి.. పండ్ల మొక్కలు పెంచడం అంటే మహా ఇష్టం.. ఒకటి కాదు రెండు కాదు.. ఎన్నో వెరైటీ ఫ్రూట్స్ ఆయన ఇంటి డాబాపైనే పండుతాయి.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన అరవా శ్రీనివాసమూర్తి తన ఇంటి టెర్రస్‌పై పండ్ల మొక్కలను పెంచుతూ ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం తన స్నేహితుని వద్ద నుంచి విత్తనాలు తెచ్చి వేసిన గ్యాక్ ఫ్రూట్ (హెవెన్ ఫ్రూట్) ఇప్పుడు ఫలాలను ఇస్తున్నది.. ఎన్నో ఔషధ గుణాలున్న స్వర్గ ఫలంగా పిలిచే ఈ పండు కథేంటో తెలుసుకుందాం..



మిద్దెపై పండ్లతోట

ఔషధ గుణాలున్న అరుదైన గ్యాక్ ఫ్రూట్ పెంపకం

మిద్దె తోట ప్రేమికులకు ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనివాసమూర్తి



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాసమూర్తి ఎన్నో ఏళ్లుగా తన భవనంపై మొక్కలను పెంచుతున్నారు. తొమ్మిది నెలల క్రితం వేసిన గ్యాక్ ఫ్రూట్ ప్రస్తుతం వందకు పైగా పండ్లను ఇచ్చాయి. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఎంతో మంది ఈ పండు విశిష్టతను గుర్తించి ముంబయి, హైదరాబాద్, శ్రీకాకుళం, వైజాగ్, వంటి ప్రాంతాల నుంచి వస్తున్నారు. గ్యాక్ ఫ్రూట్‌తో పాటు ప్రతీ రోజు పాదుకు పూసే మగ గ్యాక్ ఫ్రూట్ పువ్వును, ఆడ గ్యాక్ ఫ్రూట్ పువ్వుతో పరాగ సంపర్కం జరిపిన అరవై రోజులకు పండు తయారవుతుందని ఆయన తెలిపారు. మొదటి దశ నుంచి ఐదు దశల్లో ఈ పండు తయారువుతుంది. మొదట ఆకుపచ్చ నుంచి పసుపు, ఆరెంజ్ నుంచి రెడ్ కలర్ వచ్చాక పండును కోయవచ్చని తెలిపారు. ఒక పండు ఒక వ్యక్తి పది రోజులు పాటు తినడం గానీ జ్యూస్ చేసుకుని తాగడం గానీ చేయవచ్చన్నారు. ఈ పండులో ఉండే విత్తనాలు ఆరిన తరువాత ఉపయోగించి మొక్కలను పెంచవచ్చని తెలిపారు. ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, డిప్రెషన్ వంటి వ్యాధులు ఈ పండు తరచూ తింటూ ఉంటే ప్రాణాంతక వ్యాధులకు సులభంగా చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే ఈ పండును (హెవెన్ ఫ్రూట్) స్వర్గం నుంచి దిగివచ్చిన పండు అంటారు. వియత్నాం, మలేషియా, థాయ్‌లాండ్, చైనా దేశాల్లోనే లభించే ఈ పండు భారతదేశంలో చాలా అరుదుగా లభిస్తుంది. ఈ పండు యాంటీ ఏజింగ్‌కు కూడా బాగా పనిచేస్తుంది. ఇప్పుడిప్పుడే యువ రైతులు ఈ పంటను పండించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పండు విలువ కిలో రూ.1200 వుంటుంది. ప్రతీ ఇంట్లో ఈ మొక్కను పెంచుకుని కుటుంబం అంతా ఈ పండును తింటూ ఉంటే అనారోగ్యాలే దరిచేరవని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఎక్కువ విస్తీర్ణంలో గ్యాక్ ఫ్రూట్ పెంచాలని కోరిక



గ్యాక్ ఫ్రూట్ పండ్లను చూపుతున్న శ్రీనివాసమూర్తి

ఒక ఎకరం పొలం తీసుకుని గ్యాక్ ఫ్రూట్స్‌ను పండించాలని అనుకుంటున్నాను. అందుకు ప్రభుత్వం సహకరించాలి. గ్యాక్ ఫ్రూట్‌ను పండించాలంటే ఎంతో ఆసక్తితో పాటు శ్రద్ధ ఉండాలి. మిద్దెపై దీంతో పాటు డ్రాగన్ ఫ్రూట్, ఫ్యాషన్ ఫ్రూట్, సూర్యనామ చెర్రీ, మనాలీ చెర్రీ, యాపిల్, జాఫ్రా, స్టార్ ఫ్రూట్, పీనట్ బటర్, స్ట్రాబెర్రీ, అవకాడో, రామాఫలం ఇలా అనేక పండ్ల మొక్కలను కేవలం రెండు సెంట్‌ల భూమిలో నిర్మించిన భవనంపైన ఉన్న టెర్రస్ పైన తొట్టెలు నిర్మించి వాటిలోనే పండిస్తున్నా. నాలుగేళ్ల క్రితం నల్ల బియ్యం పంటను బకెట్లలో వేసి మూడు కేజీలు పండించా. విత్తనాలను మా బంధువుకు పంపించగా వారు పది బస్తాల నల్ల బియ్యం పండించారు. ఎటువంటి పురుగుమందులు, ఎరువులు వాడకుండా కేవలం దేశీయ పద్ధతిలోనే ఇవన్నీ పండిసున్నా. జిల్లా హార్టీకల్చర్ అధికారులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ పంట గురించి వివరించడానికి తీసుకు వెళ్తామని చెప్పారు. మా అమ్మాయి సాహితి అగ్రికల్చర్ ఎంఎస్సీ చదువుతున్న సమయంలో నాకు కూడా ఈ పండ్ల మొక్కలపై ఆసక్తి కలిగింది. ఆమె సహకారంతో వీటిని పండిస్తున్నాను.

తవ్వేసి.. వదిలేశారు !

గొల్లలకోడేరు- పాలకోడేరు గ్రామాలను కలుపుతూ యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనపై చేస్తున్న మరమ్మతులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గొల్లలకోడేరు గ్రామం నుంచి పాలకోడేరు వైపు వెళ్లే యనమదుర్రు డ్రెయిన్‌పై ఉన్న బ్రిడ్జి గోతులమయంగా మారింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జికి మరమ్మతులు చేపడతామంటూ ఈ నెలాఖరు వరకు బ్రిడ్జిని మూసివేస్తున్నట్లుగా ప్రకటన జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా నాలుగు రోజుల ముందు బ్రిడ్జిని తవ్వి శ్లాబ్ పెచ్చులను బ్రిడ్జి పైనే వదిలివేశారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లే దారి లేకపోవడంతో నడక దారిన వెళ్తున్న ప్రయాణికులు ఇదెక్కడి చోద్యమంటూ తిట్టుకుంటూ వెళుతున్నారు. నాలుగు రోజులైనా చిన్న పని కూడా చేయకుండా తవ్వి వదిలివేయడమేమిటని ప్రయాణికులు విసుక్కుంటూ ప్రయాణం సాగిస్తున్నారు. భీమవరం వైపు వెళ్ళే విద్యార్థులైతే మరీ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన పనులు మొదలుపెట్టి ప్రయాణికుల బాధలు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-పాలకోడేరు (ఆంధ్రజ్యోతి)



స్వయం సంఘాలకు సాయం

డ్వాక్రా ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు

ఆన్‌లైన్‌లో విక్రయాలు

కొయ్యలగూడెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళలను లక్షాధికారులను చేసే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులను విక్రయించడానికి ప్రోత్సాహం అందిస్తున్నది. డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ఈ ఉత్పత్తులు తయారు చేయడానికి ప్రభుత్వం, బ్యాంకుల ప్రోత్సాహం తోడవటంతో డ్వాక్రా మహిళలు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్తున్నారు.

ఏలూరు జిల్లాలో 17 మండలాల్లో డ్వాక్రా మహిళలు చేస్తున్న ఉత్పత్తులు 10,903 ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిగినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లాలో జరిగిన ఉత్పత్తుల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయాలు జరిగిన మండలాలను పరిశీలిస్తే కొయ్యలగూడెం, అగిరిపల్లి, కైకలూరు, మండవల్లి మండలాలు ముందు వరుసలో ఉన్నాయి. అగిరిపల్లి మండలంలో మూడు డ్వాక్రా సంఘాలు చేసిన 2,198 ఉత్పత్తులు, కైకలూరులో నాలుగు సంఘాలు చేసిన 2,347 ఉత్పత్తులు, మండవల్లి మండలంలో రెండు డ్వాక్రా సంఘాల్లో 2,586 ఉత్పత్తులు విక్రయాలు జరిగాయి. కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామంలో గుడ్‌హెల్త్ బ్రాండ్ పేరుతో ఒక సంఘం మాత్రమే తయారు చేసిన 1,485 చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు ఆన్‌లైన ద్వారా విక్రయించారు. ఈ సంఘం తయారు చేసిన ఉత్పత్తులను గవర్నర్ నజీర్, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, కలెక్టర్ వెట్రిసెల్వి, రుచి చూసి అభినందించారు. కనకాద్రిపురంలో ఉన్న ఈ చిరుధాన్యాల ఈ ఆహార ఉత్పత్తులను వివిధ స్టాళ్లలో ప్రదర్శించారు. ఈ ఉత్పత్తులను తయారు చేస్తున్న కృపామణి భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థలో కూడా శిక్షణ పొందారు. ఈమె ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పథకం ద్వారా రూ.10 లక్షల రుణం కూడా పొందారు. ఇందులో ప్రభుత్వం 30 శాతం రాయితీ కూడా ఇచ్చింది. ఈ విధంగా డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందుకుని ముందుకువెళ్తే మరింత అభివృద్ధి చెందడానికి వీలుంది.



చిరు ధాన్యాలతో బిస్కెట్లు తయారు చేస్తున్న మహిళ



ఆహార పదార్థాలు రుచి చూస్తున్న పీడీ (ఫైల్ ఫొటో)



కనకాద్రిపురంలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తులు

చిరు ధాన్యాల ద్వారా ఆహార ఉత్పత్తులు

కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురంలో చిరుధాన్యాల ద్వారా డ్వాక్రా మహిళలు అనేక ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. రాగి బిస్కెట్‌లు, జొన్న బిస్కెట్లు, రాగి జంతికలు, మిల్లెట్స్ రిబ్బన్స్, మిల్లెట్స్ చెకోడి, ఉప్మా రవ్వ, ఇడ్లీ రవ్వ, తదితర ఆహార ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు నిర్వహిస్తున్నారు.

చిరు ధాన్యాల ఉత్పత్తులకు మంచి డిమాండ్

మేము తయారు చేస్తున్న చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులకు మంచి డిమాండ్ వచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేస్తున్నాం. ఇటీవల తయారు చేస్తున్న ఉత్పత్తులను డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు పరిశీలించి అభినందించారు. పలువురికి ఉపాధి చూపించడమే కాకుండా డ్వాక్రా సంఘాలకు కూడా వీటిపై అవగాహన కల్పిస్తున్నాను.

- కృపామణి, నిర్వాహకురాలు



వేసవి తాపం నరులకే కాదు.. వానరాలకు కూడా తప్పడం లేదు. ఎండలు మండిపోతున్నాయి.. దాహంతో నోరు తడారిపోతోంది.. వేసవి తాపం తీరాలంటే చల్లటి నీరుంటే చాలు.. ఇదిగో ఆకివీడులో ఒక ఇంట్లో బయట టబ్‌లో ఉన్న నీటిని తాగి దాహం తీర్చుకుంటున్నాయి వానరాలు... - ఆకివీడు(ఆంధ్రజ్యోతి)

నా జీవితమూ ఇంతేనా !



ఈ బాలికకు పట్టుమని పది సంవత్సరాలు కూడా ఉండవు. కడుపు నింపుకోవడానికి యాచక వృత్తి తప్పలేదు. రోడ్డుపై వచ్చి వెళ్లేవారిని సాయం చేయమంటూ అర్థిస్తోంది. అదే సమయంలో ఆ బాలికకు వృద్ధ యాచకురాలు ఎదురైంది. వృద్ధాప్యం వచ్చినా నా జీవితం కూడా ఇలానే ఉంటుందా ? అని ఆలోచిస్తోంది.. భీమవరంలో కనిపించిన ఈ దృశ్యంపై ఆంధ్రజ్యోతి కామెంట్..

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫీమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందని పించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.


మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

అర లీటర్ పెట్రోలు రూ.100

కాళ్ల బంక్‌లో ఘరానా మోసం



పెట్రోల్ బంకులో మోసంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు

కాళ్ళ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌పి పెట్రోల్ బంకులో ఘరానా మోసం బయటపడింది. రూ.100 పెట్రోలు అడిగితే అర లీటరు మాత్రమే రావడంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు. కాళ్ళ గ్రామానికి చెందిన ఎం. సూరిబాబు తన వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో ఆగిపోయింది. దగ్గరలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకుకు వెళ్లి బాటిల్‌లో రూ. 100 పెట్రోల్ పట్టమని చెప్పాడు. మెషిన్‌లో ఫీడ్ చేసి బాటిల్‌లో పట్టిన తర్వాత బాటిల్ అర లీటర్ మాత్రమే ఉండడంతో విస్తుపోయాడు. మెషీన్ చూస్తే 0.91 లీటర్ చూపుతోందని బంక్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అదే సమయంలో మరొక వ్యక్తి వచ్చి బాటిల్‌లో పెట్రోల్ పట్టమనడంతో మరలా అదేవిధంగా అర లీటరు మాత్రమే వచ్చింది. పలువురు వాహనదారులు బంకు యాజమాన్యం చేస్తున్న ఘరానా మోసంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌లో మోసాలను తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు డిప్యూటీ సీఎం పేషీకి జిల్లా అధికారులు

మొగల్తూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు, పెనుగొండ గ్రామాల్లో నూరు శాతం సమస్యల పరిష్కారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఇరు గ్రామాల అభివృద్ధికి గ్రామ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధికారులతో రాజధానిలో ఉన్నతాధికారులు చర్చించనున్నారు. అధికారులను మంగళవారం డిప్యూటీ సీఎం పేషీకి రావాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆహ్వానించారు. జిల్లా పరిషత్ సీఈవో, జిల్లా డ్వామా పీడీ, మొగల్తూరు, పెనుగొండ మండల పరిషత్ అధికారులు, మండల గ్రామీణ విస్తరణాధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, జేఈలతో పాటు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆహ్వానం వచ్చింది. దీంతో మంగళవారం డిప్యూటీ సీఎం పేషీలో పంచాయతీరాజ్ కమిషనర్‌తో అధికారులు చర్చలు జరిపేందుకు వెళుతున్నారు.



జాతీయ రహదారి నుంచి నాచుగుంట గ్రామానికి వెళ్లే రహదారి

టోల్ ఫీజ్ తప్పించుకునేందుకు..

నాచుగుంట వద్ద ప్రమాదాల బారిన పడుతున్న వాహనాలు

ఉంగుటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): టోల్ ఫీజును ఎగ్గొట్టేందుకు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉంగుటూరు టోల్ ప్లాజా తప్పించుకునేందుకు నాచుగుంట వంతెన వద్ద యూటర్న్ తీసుకుని గ్రామం మీదుగా దారి మళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. జాతీయ రహదారిపై యూ టర్న్ తీసుకునే సమయంలో వాహనాలు ప్రమాదాల పడుతున్నాయి. ఈ నెల 11న నాచుగుంట వంతెన వద్ద యూటర్న్ తీసుకుంటున్న టిప్పర్ లారీ అదుపు తప్పి పాలకొల్లు నుంచి ఏలూరుకు వెళ్లి వాహనాన్ని ఢీకొంది. కారులో ఉన్న ఆరుగురు గాయపడగా వరుడి నానమ్మ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు.

నాచుగుంట మీదుగా వాహనాల రాకపోకలతో గ్రామంలో కూడా ప్రమాదాలు జరగడంతో బయటి వాహనాలు రాకుండా పంచాయతీ కట్టుదిట్టం చేసింది. అయినప్పటికి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాల వల్ల ప్రమాదాలు జరగకుండా టోల్ ప్లాజాను మార్చాలని మండలంలోని డెల్టా గ్రామాల ప్రజా ప్రతినిధులు తీర్మానం చేశారు. టోల్ గేటును తరలించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామన్నారు.

కలప అక్రమ తరలింపు

కొయ్యలగూడెం, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): కలప అక్రమంగా తరలిస్తున్న లారీ, మరో వ్యాన్‌ను పట్టుకున్నట్లు కన్నాపురం అటవీశాఖ సెక్షన్ అధికారి బి.దినేశ్ సోమవారం తెలిపారు. ఈ నెల 13న అర్ధరాత్రి గోకవరం నుంచి కొయ్యలగూడెం వైపు వ్యాన్‌లో మారుజాతి పుల్లలు వస్తుండగా సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకున్నామన్నారు. తుని నుంచి కొయ్యలగూడెం వైపు మారుజాతి పుల్లతో వస్తున్న లారీని పట్టుకున్నామని కన్నాపురం అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందన్నారు, ఎవరైన అక్రమంగా అనుమతలు లేకుండా కలపను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికపై అత్యాచారం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కూలి పనుల నిమిత్తం వెళ్లిన తల్లి కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి తెగబడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అమీర్ తెలిపారు. మండలంలోని కోడిగూడెంకు చెందిన బాలిక ఈ నెల 12న రాత్రి7గంటల సమయంలో ఇంటి వద్ద ఉండగా ఆమె తల్లి ప్రశాంతి కూలి పనులు తెచ్చుకోడానికి మేస్త్రి ఇంటికి వెళ్లింది. గాలిదుమ్ము రేగడంతో తల్లికి తోడుగా ఉండి తీసుకురావాలని కుమార్తెను తండ్రి పంపించాడు. బయటకు వెళ్లిన బాలికను గ్రామానికి చెందిన దిరుసుపాము సుబ్బారావు వెంబడించి సమీపంలోని పాడుబడిన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లికి విషయం చెప్పగా పోలీస్‌స్టేషన్‌లో సుబ్బారావుపై ఫిర్యాదు చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అమీర్ తెలిపారు.

దొమ్మేరు హత్య కేసులో పోలవరం యువకుల అరెస్ట్

పోలవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో జరిగిన హత్య కేసులో పోలవరం మండలానికి చెందిన ముగ్గురు యువకులను కొవ్వూరు రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దొమ్మేరుకు చెందిన పెండ్యాల ప్రభాకర్‌రావు వద్ద పెద్దేవం సచివాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన చుక్కా రామ శ్రీనివాస్ రూ. 2.30 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. బెట్టింగ్‌తో అప్పుల పాలైన శ్రీనివాస్ బాకీ ఎగ్గొట్టడమే గాక ప్రభాకర్‌రావును హతమార్చాడు. మృతుడి చేతి కడియం, ఉంగరాలు అపహరించాడు. బంగారాన్ని దొండపూడి గ్రామానికి చెందిన అంకోలు జగదీష్ దుర్గాప్రసాద్, పోలవరం గ్రామానికి చెందిన నోముల ప్రవీణ్ కుమార్ వద్ద తాకట్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ముగ్గురిని కొవ్వూరు పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి మృతి



మధుబాబు మృతదేహం వద్ద పోలీసులు, బంధువులు

మొగల్తూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో యువకుడు మృతి చెందాడు. సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి యడ్ల చిట్టిబాబు కుమారుడు యడ్ల మధుబాబు (23) డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. సోమవారం తన స్నేహితులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వెళ్లాడు. సముద్రంలో స్నానం చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు లోపలికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యాడు. మిత్రులు చేయందించినప్పటికి అలల ఉధృతికి సముద్రంలోకి కొట్టుకుపోయాడు. కొద్ది సేపటి తర్వాత విగతజీవిగా ఒడ్డుకు కొట్టుకువచ్చాడు. స్నేహితులు, స్థానికులు 104కు సమాచారం అందించారు. బీచ్ వద్దకు చేరుకున్న సిబ్బంది పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మధుబాబు మృతదేహాన్ని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం, నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

భార్య వివాహేతర సంబంధం.. భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భార్య వేరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన దాసరి లక్ష్మణరావు అలియాస్ శౌరి (40)కు భార్య సులోచన, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సులోచన వేరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని మనస్తాపంతో లక్ష్మణరావు సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సీహెచ్.దుర్గాప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దామచర్ల కొట్లాటలో 25 మందిపై కేసు

పోలీసు పికెట్ ఏర్పాటు



దామచర్లలో పహారా కాస్తున్న పోలీసులు

కుక్కునూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దామచర్లలో రెండు సామాజిక వర్గాలు పరస్పరం కొట్టుకున్న ఘటనలో 28 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మద్యం బెల్టుషాపు వద్ద రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ తలెత్తి పరస్పరం కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడగా వారిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో గొడవలు తలెత్తకుండా పోలీసులు పికెట్ కొనసాగిస్తున్నారు. సీఐ రమేశ్ బాబు కుక్కునూరు, వేలేరుపాడు ఎస్ఐలు రామకృష్ణ, రామారావు, పోలీస్ సిబ్బంది గ్రామంలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు. రెండు సామాజిక వర్గాల మధ్య కొట్లాట పరిసర గ్రామాల్లో చర్చనీయాంశమైంది.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

పి.అంకంపాలెంలో చోరీ

జీలుగుమిల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పి.అంకంపాలెంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన జయవరపు గణేశ్ కుటుంబ సభ్యులతో కలసి బాసర దేవాలయానికి వెళ్లాడు. ఇదే అదునుగా ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో కొంత నగదు, బంగారం ఉన్నట్లు బాధితుడు పోలీస్‌లకు ఫోన్ ద్వారా తెలిపాడు. దొంగలు కొంత డబ్బు బంగారం ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు పోలీసులు చెప్పారు. బాధిత కుటుంబీకులు అందుబాటులో లేకపోవడంతో నగదు, బంగారం ఎంతపోయిందనే వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. రహదారి పక్కనే ఇంట్లో చోరీ జరిగిన విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది. ఉదయం బంధువులు, స్థానికులు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం చోరీ జరిగిన ఇంటిని సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సై పి.వినయ్‌కుమార్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, వేలి ముద్ర నిపుణులు ఇంట్లో చోరీ జరిగిన ప్రదేశాల్ని పరిశీలించారు.

అపార్టుమెంట్‌లో చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంటులో తన ఫ్లాట్‌కు తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఫ్లాటు తలుపు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఏలూరు కట్టాసుబ్బారావు వీధిలోని సోహిని టవర్స్ అపార్టుమెంట్‌లో యార్లగడ్డ సురేష్ నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి భీమడోలులోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చేటప్పటికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో వెండి వస్తువులు, రూ.వెయ్యి నగదు అపహరించినట్ల గుర్తించారు. ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పంగిడిగూడెంకు చెందిన గుమ్మడి మహలక్ష్మి(80) ఈనెల 7న రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొంది. మహలక్ష్మి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఈనెల13న సాయంత్రం మృతిచెందినట్లు ఎస్ఐ టి సుధీర్ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి : ముగ్గురి అరెస్ట్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నారని సమాచారం టూటౌన్ సీఐ కె అశోక్‌కుమార్‌కు అందడంతో సిబ్బందితో సోమవారం రాత్రి దాడి చేశారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడానికి చెందిన శివ ప్రసాద్, అతడి భార్య కుమారి కలిసి సెయింట్ థెరిస్సా స్కూలు సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నారు. పోలీసులు దాడి చేసి వారిద్దరితో పాటు అక్కడకు విటుడిగా ఉన్న నాగేంద్రను కూడా అరెస్టు చేశారు. ఒక యువతిని సంరక్షించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లంకపేటలో సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : లంకపేట నాల్గవ రోడ్డులోని శ్రీకోదండ రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భీమవరపు పాపారావు, దూండి శివరామ్, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పి.లోవరాజు, కె.పరమేశ్వరరావు, చిందాడి రామారావు, జి.మల్లేశ్వరరావు, కె.అశోక్ పాల్గొన్నారు.

నేటి నుంచి 22 వరకు విద్యుత్ సరఫరా వేళల మార్పు

టి.నర్సాపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజుపోతేపల్లి, కొత్తగూడెం ఫీడర్ పరిధిలో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేపట్టినట్టు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ మార్పును గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అహ్మద్ కోరారు.

ఎంపీ నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్లు

నేడు ప్రారంభించనున్న ఎంపీ మహేశ్ కుమార్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రయోగశాలలను బలోపేతం చేయడానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ చొరవతీసుకున్నారు.ఎంపీ నిధుల నుంచి ఒక్కో స్కూలుకు సైన్స్ కిట్‌ను సమకూర్చేనిమిత్తం రూ.4 లక్షల చొప్పున మొత్తం 50 స్కూళ్లకు రూ.2 కోట్లను వెచ్చించారు. ఈ నిధులతో ఆయా సబ్జెక్టుల పాఠ్యాంశాలకు సంబంధించి ల్యాబ్ పరికరాలు, రసాయనాలు, మ్యాప్‌లు, తదితర వస్తువులతో కూడిన సైన్స్ కిట్లను తొలివిడతగా జిల్లాలో మండలానికి రెండు చొప్పున ఎంపికచేస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్టెమ్, ఏటీఎల్, పీఎంశ్రీలకు జిల్లాలో ఎంపికైన పాఠశాలలను మినహాయించి మిగతా ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్లను అందజేయాలని ఎంపీ సంకల్పించారు. తొలివిడతగా 50 పాఠశాలలకు సైన్స్ కిట్లను మంగళవారం ఏలూరు పేరయ్యకోనేరు సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఎంపీ అందజేయనున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో మరో 50 పాఠశాలలకు వీటిని ఇస్తారు. మంగళవారం ఏలూరులో నిర్వహించనున్న కిట్ల అందజేత కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ పాల్గొననున్నారు.

వైశాఖ బ్రహ్మోత్సవాల రాట పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం రాట పూజలను నిర్వహించారు. మే 3 నుంచి 12వ తేదీ వరకు వైశాఖ బ్రహ్మోత్సవాలు, చతుర్వేద హవనాలు, విశేష హోమాలు, నిత్య వాహన సేవలు, ఆలయ విమానగోపుర సుదర్శన శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఈవో నల్లూరి సతీశ్ కుమార్, పాలడుగు వెంకట రమాదేవి, లక్ష్మణరావు బృందంతో ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, ఆలయ వేద పండితులు యనమండ్ర వెంకట రవిప్రకాశ్ శర్మలు రాట పూజలు చేయించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాట పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉమా సహిత భోగలింగేశ్వర స్వామికి పూజలు

పోలవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గుంజవరం గ్రామంలో కొలువైన ఉమాసహిత భోగలింగేశ్వరస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు దిగువ కాపర్‌డ్యాం వద్ద స్వయంభువుగా వెలసిన ప్రాచీన మహానందీశ్వరస్వామి ఆలయంలో మహానందీశ్వర స్వామికి, బోట్ ఆఫీసు శివాలయంలో, పోలవరం వాసవీ కన్యకాపరమేశ్వరీ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.






సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాట్నాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

పెదవేగి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారి తిరునాళ్ల మూడో రోజు సోమవారం ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, నవగ్రహ మండపార్చన, పరివార దేవతార్చన, శ్రీఅమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సోమవారం శ్రీరాట్నాలమ్మ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఉదయం 8గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, లలితా త్రిపురసుందరి హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7గంటలకు శ్రీరాట్నాలమ్మకు నిర్వహించిన సహస్ర కమల పూర్వక సువర్ణ పుష్పోత్సవం కనువిందుగా జరిగింది. రాత్రి 9గంటలకు నిర్వహించిన సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో ప్రముఖ సినీ గాయని లక్ష్మీ గాయత్రి తన గాత్రంతో ప్రేక్షకులను కట్టిపడేసింది.



నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వడగళ్ళ వానలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మాల సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం దొరమామిడిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా రాష్ట్రంలోనూ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనూ బలమైన ఈదురుగాలులు, వడగళ్లతో కురిసిన భారీ వర్షాలకు రైతులు వరి, మొక్కజొన్న, అరటి, మామిడి, జీడి మామిడి, పొగాకు, మిర్చి పంటలను తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని పంటలు చేతికి వస్తున్న తరుణంలో అకాలవర్షాలు కారణంగా నష్టపోయారన్నారు. రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. మిగిలిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వరావు, యు.ఏసుబాబు, కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలి

కుక్కునూరులో ర్యాలీ నిర్వహించిన సీపీఎం నాయకులు

కుక్కునూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి విరుద్ధమైన వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా కేంద్రంలో బీజేపీ పాలన కొనసాగుతోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను మతసామరస్యాన్ని కాపాడాలని, అన్ని సామాజిక వర్గాలను సమానంగా చూడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.నాగేంద్రరావు, వై.సాయికిరణ్, లక్ష్మయ్య, మహబూబ్ భాష, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఎస్.కె.గౌస్, ముస్లిం సంఘ నాయకులు ఖదర్ బాబా, ఛాంద్ బాష, సలీం పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం ఎదుట నిరసన తెలియజేస్తున్న ముస్లింలు



పోలసానిపల్లిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



వీరభద్రవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు

బలహీన వర్గాల సారథి అంబేడ్కర్

వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

ఉత్సాహంగా పాల్గొని నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, నాయకులు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశేష కృషి చేశారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 27వ డివిజన్‌లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి రాజ్యాంగాన్ని రూపొందించి ఇచ్చిన మేధావి అంబేడ్కర్ అని అన్నారు. ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ భారత్ బలమైన దేశంగా ఆవిర్భవించేందుకు అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగమే కీలకమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్, కె.వంశీ, వై.శివ, నాని, వై.ప్రసాద్, ఎం.సూర్యనారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గుడూరు రాజేశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు కందుల రమేశ్, కే.మురళీ, కాశీకృష్ణ, ఎం.సుమన్, కందులరాజు, కె.శేషయ్య పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● ఏలూరు కార్పొరేషన్ :కోటదిబ్బ వద్ద ఉన్న విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం వద్ద సోమవారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, అప్పలరాజు, బాజీ, సోమేశ్వరరావు, పెద్దిరాజు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : సీపీఐ కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ ఆధ్వర్యంలో నిర్వహించగా సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, మన్నవ కృష్ణచైతన్య, కురెళ్ల వరప్రసాద్, పల్లె వెంకట నారాయణ రావు, పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు. కోటదిబ్బ వద్ద ఉన్న విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, అప్పలరాజు, బాజీ, సోమేశ్వరరావు, పెద్దిరాజు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన గొప్పతనం గురించి ప్రిన్సిపాల్ గిరిబాబు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●ఏలూరు రూరల్ : విద్యుత్ భవన్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్ల ఎస్‌ఈ విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పాల్, ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.రాధాకృష్ణ, పి.శశిధర్, నాయకులు తురగా రామకృష్ణ, వి.రాము, పి.శ్రీనివాస్, భీమేశ్వరరావు, పి.గంగాధర్, పి.వి.కృష్ణ రాజ, ఉద్యోగులు పాల్గొన్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆర్టీసి విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తేజస్విని, ఎన్.కాశీనరేష్, సరిది రాజేష్, రెడ్డి గౌరీశంకర్, బొత్స మధు పాల్గొన్నారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీపీ పి.శ్రీనివాసరాజు, ఎంపీడీవో వెన్నా శ్రీలత పాల్గొన్నారు.

● లింగపాలెం : అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వేములపల్లిలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన కొంత సేపు క్రికెట్ ఆడి అందరినీ ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నత్తా దివ్యదీప్తి, గరిమళ్ల చలపతిరావు, ఎం.వరప్రసాద్, పి.ప్రభాకర్, పి.మురళి, టి.దాసుబాబు, పి.శ్రీను, ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

● పోలవరం : ప్రగడపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం అంబేడ్కర్ సెంటర్‌లో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్,న్యాయవాది సొబ్బన ఆనంద్, పాత్రికేయులు సొబ్బన రాజశేఖర్ బాబు, పైడిపాక చంద్రన్న కాలనీలో ఈర్నాల జాన్‌బాబు, గూటాల, యడ్లగూడెం, కొత్తపట్టిసీమ గ్రామాల్లో బుగ్గా మురళీ కృష్ణ, అక్కాబత్తుల రాజు, బల్దిరెడ్డి అప్పారావు, కరిబండి శ్రీను, పొడుం శ్యాం అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం ర్యాలీలు నిర్వహించారు.

● టి.నర్సాపురం : వీరభద్రవరం, కేతవరం, బొర్రంపాలెం, టి.నర్సాపురం, పుట్రేపు, రుద్రకోటరాజు గూడెం, బంధంచర్ల, నక్కినవాడిగూడెం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామ్మూర్తి, ఎస్సై ఎం.జయబాబు, శీలం సాయివినయ్, తాడేపల్లి చందు, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో అంబేడ్కర్ యువత కె.విజయ్, అర్జా సాగర్, గుండే మహరాజు, ఓగిరాల విజయ్, భూక్యా వేణుగోపాల్, ఎన్.జలపాలు పాల్గొన్నారు.

● కామవరపుకోట : ఆడమిల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ బీసీ సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జీ, యలమర్తి రాం బాబు, టి.లక్ష్మణరావు, జడ్పీటీసీ కె.రమేశ్, ప్రశాంత్, నవీన్, బాబీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● చింతలపూడి : పట్టణ పరిధిలోని బోయగూడెం, పాతబస్టాండ్, పాత చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, సి.హెచ్.ధర్మరాజు, టి.ఎస్.వి.కుమార్, బందెల ఆశీర్వాదం, అనీష్ కుమార్, పలువురు పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో మండలాధ్యక్షులు వి.సుందరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మన్నె వెంకటేశ్వరరావు, కొనకళ్ల కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, మల్లెల జయరాజు పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి టి.బాబు, కంచర్ల గురవయ్య, దొంత కృష్ణ, ఎస్.కె.కాలేషా పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

● భీమడోలు : భీమడోలు, పోలసానపల్లి, అంబర్‌పేట గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ అసీనారహీమా బేగమ్, కె.పెద్దిరాజు, ప్రవీణ్ పటేల్, వాసు పాల్గొన్నారు. భీమడోలు సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల, పంగిడిగూడెం, దొరసానిపాడు, జి.కొత్తపల్లి గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పెదవేగి : గార్లడుగు పంచాయతీ వెంకటకృష్ణాపురంలో మారుమూడి థామస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రభాకర్ పాల్గొని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటకృష్ణాపురంలో 20 పేద కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని మేకలను ఉచితంగా అందిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, ముప్పాళ్ల నాగయ్య పెన్మెత్స జయబాబు, జక్కుల వెంకటేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు మారుమూడి థామస్, కాపుదాసి రవి, ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్ : శాంతినగర్‌లో ఎంపీ మహేశ్ క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ నేతలు లంకపల్లి మాణిక్యాలరావు, విజయ్‌కుమార్, ఎన్.నవీన్ రాజు, విజయ్‌కుమార్, లంకపల్లి బాలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : బుట్టాయగూడెం, ముప్పినవారి గూడెం, దుద్దుకూరు అడ్డరోడ్డు, దొరమామిడి, రెడ్డిగణపవరం, కె.ఆర్.పురం గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. బుట్టాయగూడెంలో కేవీపీఎస్ నాయకుడు ఎ.ఫ్రాన్సిస్, టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

● వేలేరుపాడు/కుక్కునూరు : వేలేరుపాడులో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌దొర, దేవిరెడ్డి సుధాకర్, మంచెర్ల తమ్మయ్య, క్రాంతికుమార్, నరసింహారావు, కె.రవీంద్ర, జాన్‌బాబు, చక్రీ, కేసగాని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.కుక్కునూరు, రాజీవ్‌నగర్ గ్రామాల్లో నాయకులు ర్యాలీలు నిర్వహించారు.

● కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నేత కరాటం ఉమా, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, కె.ఉమా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, పట్టణ జనసేన అధ్యక్షుడు పారేపల్లి శ్రీను, దకారపు మధు, ఏపూరి సతీశ్, నక్కా బాబి, మేడిన కన్నయ్య, బూచిమంచి శ్రీను, గంటా రమేశ్, శోభన్ బాబు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : జీలుగుమిల్లి, దర్భగూడెంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని విగ్రహాలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, టీడీపీ, జనసేన పార్టీల మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, పసుపులేటి రాము, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.రాజబాబు, కందుల ప్రకాశ్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

● జంగారెడ్డిగూడెం : అంబేడ్కర్ బలహీన వర్గాల సారథి అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు పాతూరి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు.



కొయ్యలగూడెంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, నాయకులు

భానుడి భగభగలకు విలవిల

నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

పోలవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు పోలవరం మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 9 గంటల వరకూ మేఘావృతమై ఉన్న వాతావరణం క్రమక్రమంగా సూర్యుని ప్రతాపంతో వేడెక్కింది. ఎండ తీవ్రతకు ప్రజానీకం ఇండ్లకే పరిమితమయ్యారు. ఎండ తీవ్రతకు మెయిన్ బజార్ రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉష్ణోగ్రతలను తట్టుకోలేక వ్యాపారులు దుకాణాలు మూసేసి తిరిగి సాయంత్రం షాపులు తెరుస్తున్నారు. మండలంలో గతంలో పలు కూడళ్ల వద్ద రెవెన్యూ అధికారులు నిర్వహించే చలివేంద్రాలు లేకపోవడంతో దాహార్తికి బాటసారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన పోలవరం ప్రధాన రోడ్డు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణకు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అగ్నిమాపక అధికారి జి.అబ్రహాం తెలిపారు. సోమవారం అగ్నిమాపక కార్యాలయం వద్ద వారోత్సవాల కరపత్రాలను జీవీ మాల్ మేనేజర్ కాకి మురళీ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ మేరకు ముంబై ఓడ రేవు వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం సిబ్బంది పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

● భీమడోలు : అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తపడాలని మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్ర కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో వారోత్సవాల ప్రారంభించారు. అగ్నిమాపక అధికారి నాగరాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.



ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న మురళీ శ్రీనివాస్



బస్సులో ప్రయాణం చేస్తున్న ఎమ్మెల్యే

ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే రోషన్

కామవరపుకోట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదివారం రాత్రి ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గంలోని ఆడమిల్లి గ్రామంలో ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులతో పాటు కామవరపుకోట వరకు నిలుచునే ప్రయాణించారు. ప్రయాణికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి సమస్యలను అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు,కార్యకర్తలు ఉన్నారు. అనంతరం కామవరపుకోటలో కూటమి నాయకులతో కొద్దిసేపు భేటీ అయ్యారు.

టోల్ గేటును తరలించండి

ఉంగుటూరు నాయకుల డిమాండ్

ఉంగుటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు టోల్ గేటును తక్షణమే నాచుగుంట వద్ద సేకరించిన స్థలానికి మార్చాలని కూటమి నాయకులు కోరారు. సోమవారం నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ ఇబ్బందులను వెల్లడించారు. టోల్ గేట్‌ను తరలించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ టోల్ ప్లాజా వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, నాచుగుంట వంతెనపై నుంచి ఉంగుటూరు వంతెన మీదుగా వాహనాలు తరలి వెళ్లడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.టోల్ ప్లాజా అధికారుల నిర్లక్ష్యం వల్ల అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టి.డి.పి. మండల అధ్యక్షులు పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్, ఇమ్మని గంగాధరరావు, బండారు మధు, చిట్టూరి హరిబాబు ఉన్నారు. ఈ సందర్భంగా కాకర్లమూడి, దొంతవరం, వి.ఏ.పురం, కాగుపాడు సర్పంచులు నౌడు వెంకట్రావు, కంబంపాటి సత్యవతి, పొట్ట ఏడుకొండలు టోల్ ప్లాజాను తొలగించాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉంగుటూరు కూటమి నాయకులు



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని రాష్ట్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ అన్నారు. ఏలూరులోని లక్ష్మీనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మహాత్మజ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరో ముఖ్య అతిథిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం పాటుపడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహమూర్తి, లక్ష్మీనగర్ అభివృద్ధి కమిటీ నాయకులు కప్పాసత్యనారాయణ, గొల్లపల్లి మురళీ, ఏసుపాదం, వీ.సాల్మన్‌రాజు, కొరపాటి కిషోర్, జోసఫ్, రిటైర్డ్ ఎంఈఓ గాబ్రియేలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఎల్‌ఎండీ పేట విద్యార్థిని ప్రతిభ

అభినందించిన అధికారులు

పోలవరం,ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఎల్.ఎం.డి.పేట బాలిక ముత్తబోయిన రేఖను సోమవారం పలువురు అధికారులు, ఉపాధ్యాయులు మండల ప్రజలు అభినందించారు. రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు కళాశాలలో చదివిన రేఖ వెయ్యికి 991 మార్కులు సాధించింది. గతంలో పది పరీక్షల్లో 571/600 మార్కులు సాధించింది. బాలిక తండ్రి వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే తాను ఈ మార్కులు సాధించానని విద్యార్థిని రేఖ తెలిపింది.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

పోలవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎల్.ఎం.డి.పేట గ్రామానికి సమీపంలో నిర్మించిన కోండ్రుకోట పునరావాస కాలనీలో సోమవారం భక్తులు నూతన రామాలయంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రామాలను తరలించిన క్రమంలో రామాలయాన్ని తరలించగా జీర్ణావస్థలో ఉన్న విగ్రహాలను సైతం తరలించారు. విగ్రహ ప్రతిష్ఠలో కోండ్రుకోట పంచాయతీ పరిధిలో ఉన్న 422 గిరిజన కాలనీలు, 204 గిరిజనేతర కాలనీల ప్రజలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు నిర్వాహకులు ఐటీడీఏస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమాల్లో కోండ్రుకోట గ్రామ పెద్దలు మిడియం కన్నపరాజు దొర, కొర్సా రామారావు, కడబాల విష్ణురెడ్డి, ఏపి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పూనెం రవీంద్రమోహన్, సర్పంచ్ పైదా నాగరాజు, ఫిలోమన్, మేదే బొత్త ముక్కయ్య పోశియ్యనాగేశ్వరరావు కోండ్రుకోట యూత్ జె.సాగర్, పూనెం సత్యనారాయణ దొర, మడకం శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దెందులూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బతగలకుండా అప్రమత్తంగా ఉండాలని దెందులూరు మండలం గోపన్నపాలెం ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు గంధ్రపు రాకేశ్ సూచించారు. వేసవి జాగ్రత్తల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ ఎండకు బయటకు వెళ్లకుండా నీడపట్టునే ఉండాలన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో ఎండలో పని చేసిన వారికి జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు వంటి సమస్యలు వస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని అన్నారు.



పెరిగిన ఇంటర్ ఉత్తీర్ణత

ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధించారు. కళాశాల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా మెరుగుపడింది. 2023 - 24లో ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 41 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది 63 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో గత ఏడాది 36.5 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 79 శాతానికి పెరిగింది. గత ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కేవలం 5.5 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది ఆ గ్రూపులో 75 శాతం, సీఈసీ గ్రూపులో 58 నుంచి 86 శాతానికి ఉత్తీర్ణత పెరిగింది. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో గత ఏడాది 27 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది 50 శాతానికి, సీఈసీ గ్రూపులో 50 నుంచి 70 శాతానికి ఉత్తీర్ణత పెరిగింది. గతేడాది కళాశాలలో పర్యవేక్షణ లోపంతో ఫలితాల్లో వెనుకబడింది. ఈ ఏడాది గత నాలుగు నెలలుగా ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో అధ్యాపకులు ఫలితాల మెరుగునకు కృషి చేయటంతో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది.



శ్రీనివాసుని కళ్యాణం చూతము రారండి..

20 నుంచి లక్ష్మీపురంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు

23న రాత్రి స్వామివారి తిరుకల్యాణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శతాబ్ధాల కాలం నాటి పురాతన చరిత్ర కలిగి, లక్ష్మీపురం గ్రామంలో వెలుగొందుతున్న సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో ఏడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీనివాసుని పెండ్లికుమారునిగా పద్మావతి, అండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవ ప్రారంభానికి శ్రీకారం చుడతారు. ఈనెల 21న స్వామివారి కల్యాణానికి సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో అర్చకులు ధ్వజారోహణ జరుపుతారు. 23న రాత్రి 8గంటలకు ఉభయదేవేరులతో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ ఆవరణలోని కల్యాణ వేదిక వద్ద నిర్వహిస్తారు. 24న సమీప గ్రామమైన తిమ్మాపురం వరకూ గరుడ వాహనంపై కొలువుదీరిన కల్యాణమూర్తులు ఊరేగుతారు. 25న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజ అవరోహణ జరుగనున్నాయి. 26 రాత్రి జరుగనున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈవో మూర్తి వివరించారు.

ఆలయ ప్రత్యేకత



ఒకే ఆలయగోపుర గర్భగుడిలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లతో పాటుగా జగన్నాథస్వామి, బలరామ, సుభద్రదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత. పచ్చదనంతో పాటు ఆహ్లాదాన్నిచ్చే ఆలయ పరిసరాలు భక్తులను ఆహ్లాద పరుస్తాయి. శ్రీవారి క్షేత్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న ఈ ఆలయాన్ని శతాబ్దన్నర క్రితం ఒడిశా రాష్ట్రానికి చెందిన మంత్ర రత్నం అమ్మాజీ తన ఇలవేల్పు శ్రీనివాసుని ఆలయాన్ని నిర్మించారు. ఆమె పూరీ మఠాధి పతులు కావడంతో జగన్నాథస్వామిని ప్రతిష్ఠించారు. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరడంతో 1992లో శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని జీర్ణోద్ధరణ జరిపి ప్రతీ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తోంది.



జగన్నాథస్వామి, బలరామ, సుభద్ర

నేడు డిప్యూటీ సీఎం పేషీకి జిల్లా అధికారులు

మొగల్తూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు, పెనుగొండ గ్రామాల్లో నూరు శాతం సమస్యల పరిష్కారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. గ్రామ, మండల పరిషత్, జడ్పీ అధికారులతో రాజధానిలో ఉన్నతాధికారులు చర్చించనున్నారు. అధికారులను మంగళవారం డిప్యూటీ సీఎం పేషీకి రావాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆహ్వానించారు. జిల్లా పరిషత్ సీఈవో, జిల్లా డ్వామా పీడీ, మొగల్తూరు, పెనుగొండ మండల పరిషత్ అధికారులు, మండల గ్రామీణ విస్తరణాధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, జేఈ, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆహ్వానం వచ్చింది.

పసిడి పరుగులు



- రూ.లక్షకు చేరువలో బంగారం
- పది గ్రాముల బిస్కెట్ రూ.94,200
- ఆర్నమెంట్ ధర రూ.86,650

నరసాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పసిడి ధర తగ్గేదేలే అంటున్నది. స్వల్పంగా తగ్గినా..మళ్లీ పెరిగింది. సోమవారం పది గ్రాముల బిస్కెట్ బంగారం రూ.94,200 పలకగా ఆర్నమెంట్ బంగారం రూ.86,650కి చేరింది. గ్రాము అర్నమెంట్ బంగారం కొనాలంటే రూ.8,660, అదే బిస్కెట్ బంగారం రూ.9,420 చేతిలో ఉండాల్సిందే. గత ఏడాది వరలక్ష్మి వ్రతం పండుగ రోజున గ్రాము ఆర్నమెంట్ బంగారం రూ.6,500 పలికింది. అదే సమయంలో బిస్కెట్ ధర రూ.7,200 ఉంది. కేవలం ఆరు నెలల్లోనే గ్రాముకు రూ.2 వేలు పైనే పెరిగింది. ఈ ఏడాది ఆరంభంలో పసిడి ధర భారీగా పెరవగవచ్చునని అంచనా వేశారు. డిసెంబర్ నాటికి పది గ్రాముల బంగారం రూ.లక్షకు చేరుతుందని భావించారు. ఏడాది ఆరంభమై నాలుగు నెలలు కాకుండానే ధర రూ.లక్ష వైపు పరుగులు తీస్తుండడంతో వినియోగదారులు బులియన్ మార్కెట్ వైపు చూసేందుకు సంకోచిస్తున్నారు. ధర ఇదే విధంగా పెరిగితే మే నాటికి గ్రాము బిస్కెట్ రూ.10 వేలు పలకవచ్చునని బులి యన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్నమెంట్ కూడా గ్రాము రూ.9 వేలకు చేరుతుందని అంచనా కడుతున్నారు. పసిడి ధర పెరుగుదలకు అనేక కారణాలు చూపి స్తున్నారు. అమెరికా అధ్యక్షుడు విధించిన సుంకాలతో స్టాక్ మార్కెట్‌లు కుదేలయ్యాయి. అక్కడ ప్రభుత్వం జారీ చేసే బాండ్ ధరలు తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో ఆర్థిక మాంద్యం వస్తుందన్న భయంతో చాలామంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు. ఈ కారణంగానే ధర దిగి రావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఒక్కసారిగా పడిన అమ్మకాలు

ధర ప్రభావం జిల్లాలో అమ్మకాలపై చూపింది. ప్రస్తుతం సీజన్ అయినప్పటీ అమ్మ కాలు మాత్రం అంచనాకు మించి లేవు.ధర తగ్గుముఖం పట్టవచ్చన్న అభిప్రాయంలో విని యోగదారులు ఉన్నారు. ఈ కారణంగా ఈ ధరలో కొనేందుకు ఎవరు షాపులకు వెళ్లడం లేదు. దీంతో దుకాణాలు వెలవెల బోతున్నాయి. రోజుకు రూ.50 లక్షలు అమ్మే పెద్ద దుకాణం రూ.10 లక్షలు కూడా అమ్మకాలు జరపడం లేదు. సాధారణంగా ఈ సీజన్‌లో రోజుకు రూ.10 నుంచి రూ.20 కోట్లు వరకు జిల్లాలో వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం అమ్మకాలు రూ.5 కోట్లు కూడా మించడం లేదన్నది సమాచారం.

16న తలనీలాల సేకరణకు వేలం

ముదినేపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తుల తలనీలాలు సేకరణ హక్కులకు ఈ నెల 16న వేలం నిర్వహించనున్నారు. తలనీలాలతో పాటు, భక్తులు సమర్పించిన బియ్యాన్ని పాడుకునేందుకు ఈనెల 16న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ గంగాశ్రీదేవి తెలిపారు.



ముద్దరబోయిన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నేతల నివాళి



చనుబండలో అంబేడ్కర్ యూత్ బైక్ ర్యాలీ



కైకలూరులో అంబేడ్కర్ విగ్రహం ఎమ్మెల్యే కామినేని నివాళి

అంబేడ్కర్‌కు నివాళి

నూజివీడు టౌన్ / చాట్రాయి / ముసునూరు / ఆగిరిపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ కొమ్మని విజయ, కందిపల్లి చెన్నారావు, కృష్ణారావు, గొల్లు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు. ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బత్తులవారిగూడెంలో ముసునూరు రాజా తదితరులు నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూపేటలో పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించగా, ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్, చనుబండ, సూరంపాలెం, పోతనపల్లి, చిన్నంపేట, జనార్ధనవరం తదితర గ్రామాలలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిదులు, దళిత యూత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎస్సై రామకృష్ణ, సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కారంగుల వాసు, నక్కా రాము, కలపాల రమేష్, కొమ్ము ఆనందం, ఆదిమూలం శర్మ, కంచర్ల హనుమంతరావు, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ముసునూరు మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాట్రేనిపాడు, చెక్కపల్లి ఎస్సీ కాలనీల్లో అంబేడ్కర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో పలుచోట్ల కార్యక్రమాల్లో వేంపాడు డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గూడపాటి అజయ్‌కుమార్, పాశం నాగబాబు, ఆముదాల ఇసాక్, చట్టుమల యేసోబు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముసునూరు బడుగువారిగూడెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత యువకులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి న్యాయవాది పాలేటి ఉమామహేశ్వరరావు, ఎస్సై శుభశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ లక్ష్మి విక్టర్ బాబు, తాడి నరసింహరావు, రొంపిచెర్ల గిరిదర్, తాడి ప్రసాద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. తోటపల్లి, రాజవరం గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు.

ముదినేపల్లి/ కలిదిండి/మండవల్లి/ కైకలూరు ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలు ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి, చినపాలపర్రు, పెదపాలపర్రు గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఆదర్శ దళిత సమాఖ్య నాయకులుపూలమాలలు వేసి నివాళుర్పించారు. అంబేడ్కర్ నగర్‌లో బాబురావు పలువురు నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అల్లూరులో తెలుగు యువత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సింగరాయపాలెం, ఉప్పరగూడెం, కొరగుంటపాలెం, విశ్వనాద్రిపాలెం, అల్లూరు, వడాలి మీదుగా ముదినేపల్లి వరకు అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో సుమారు 20 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. కలిదిండి, వెంకటాపురంలో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కూటమి నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళుర్పించారు. పెదలంక, కలిదిండి, గుర్వాయిపాలెం, కొండంగి గ్రామాల్లో దళిత సంఘాల నాయకులు బోడిగడ్డ కిశోర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండవల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కామినేని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, గుడివాడ చిట్టిబాబు, గంగునేని ప్రసాద్, చలపతి, ముళ్లపూడి సత్తిబాబు, యార్లగడ్డ శంకర్, శాంతరాజు, భాస్కరరావు పాల్గొన్నారు. మండవల్లిలో బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్, మాల మహాసేన మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కైకలూరు తాలుకా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కూటమి నేతలు నివాళులర్పించారు. కొట్టాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆవిష్కరించారు. దళిత సంఘాలు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ప్రారంభం



ముదినేపల్లి: మండలంలోని చినపాలపర్రు శివారు అత్తివాని చెరువు వద్ద బండికమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇళ్ల ముందే నిలిచిన మురుగునీరు

మోడల్ కాలనీ

అన్నీ సమస్యలే..!

ఎమ్మార్ అప్పారావు కాలనీ దుస్థితి

(నూజివీడు టౌన్-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మోడల్ కాలనీగా ప్రారంభమైన నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దాదాపు ఏడు వేల మందికి గృహాలు మంజూరు చేయగా ఇప్పటివరకు ఐదు వేల గృహాలు పూర్తయ్యి నివాసముంటున్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం మోడల్ కాలనీగా ప్రారంభమైనా నేటికీ పూర్తిస్థాయిలో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూజివీడు పట్టణంలో నాల్గో వంతు జనాబా ఇక్కడ ఉన్నా శ్మశానవాటిక సైతం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరైనా మృత్యువాత పడితే కాలనీ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రధాన పట్టణంలోని శ్మశాన వాటికకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాలనీలో తాగునీటి సరఫరా మెరుగుపడినా పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రధాన రహదారి, ఇళ్లముందు మురుగు నిలబ డడంతో దోమలు, అంటురోగాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ గోడును పట్టించుకొని సీసీ రహదారుల నిర్మాణంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు, శ్మశాన వాటిక సౌకర్యాలను ఏర్పాటుచేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయండి



కాలనీలో శ్మశాన వాటిక లేకపోవడంతో సుదూరంలో ఉన్న పట్టణానికి మృతులను తరలించాల్సిన పరిస్థితి. కాలనీ సమీపంలో భూమిని సేకరించి శ్మశాన వాటిక ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- పుల్లా లక్ష్మణరావు

రహదారులు, డ్రెయినేజీ నిర్మించాలి



ఎమ్మార్ అప్పారావు కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలం రహదారులు బురద కయ్యలుగా మారుతున్నాయి. సీసీ రోడ్లుగా అభివృద్ధి పరచి పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుచేయాలి.

- షేక్ నజీమ

తాగునీరు అందించారు



కూటమి ప్రభుత్వం తాగునీటి సరఫరా మెరుగుదలకు చర్యలు చేపట్టింది. కాలనీలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి శ్మశాన వాటిక ఏర్పాటుకు కృషిచేస్తాం.

- తలపంటి వెంకట రాజశేఖర్

వైష్ణవికి సీఎం శుభాకాంక్షలు

ముదినేపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి బ్రాండ్ అంబాసిడర్ ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా సోమవారం పలువురు నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆమెకు మంగళగిరి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షల సందేశం పంపుతూ అమరావతి అభివృద్ధిపై వైష్ణవికి ఉన్న చిత్తశుద్ధి, అభిమానాన్ని కొనియాడారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ లక్ష్మీకాంతం తదితరులు వైష్ణవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



సుదాబత్తుల విజయకుమార్‌కు సత్కారం

రాష్ట్ర జై కాపుసేన ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా సుదాబత్తుల

మండవల్లి ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జై కాపుసేన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మండవల్లి గ్రామానికి చెందిన ప్రొఫెసర్, సామాజిక కార్యకర్త సుదాబత్తుల విజయకుమార్‌ను రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బసవ చినబాబు, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్నబాబు నియమించారు. తనపై నమ్మకంతో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం మత్తులో దాడి

ముదినేపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామంలోని వైన్స్ షాపు వద్ద మద్యం తాగిన ఇద్దరు అక్కడే ఉన్న మరొకరిని కొట్టి గాయపర్చారు. గత నెల 28న వైన్ షాపు వద్ద నాగేంద్ర ఫోన్ మాట్లాడుతుండగా, అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరావు, చిన్నం శివ అతనితో తగాదా పడ్డారు. వివాదం పెరిగి నాగేంద్రపై ఇద్దరు వ్యక్తులు కర్రతో కొట్టి గాయపర్చారు. ఆసుపత్రిలో చేరగా, అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

సారా స్థావరాలపై దాడి

ముసునూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చిల్లబోయినపల్లిలో సారా తయారీ స్థావరాలపై ఆదివారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, మిడత శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. పామర్తి శ్రీను వద్ద 5లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు.

బాలికపై అత్యాచారం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కూలి పనుల నిమిత్తం వెళ్లిన తల్లి కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి తెగబడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అమీర్ తెలిపారు. మండలంలోని కోడిగూడెంకు చెందిన బాలిక ఈ నెల 12న రాత్రి7గంటల సమయంలో ఇంటి వద్ద ఉండగా ఆమె తల్లి ప్రశాంతి కూలి పనులు తెచ్చుకోడానికి మేస్త్రీ ఇంటికి వెళ్లింది. గాలిదుమ్ము రేగడంతో తల్లికి తోడుగా ఉండి తీసుకురావాలని కుమార్తెను తండ్రి పంపించాడు. బయటకు వెళ్లిన బాలికను గ్రామానికి చెందిన దిరుసుపాము సుబ్బారావు వెంబడించి సమీపంలోని పాడుబడిన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లికి విషయం చెప్పగా పోలీస్‌స్టేషన్‌లో సుబ్బారావుపై ఫిర్యాదు చేశారు.

అపార్టుమెంట్‌లో చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంటులో తన ఫ్లాట్‌కు తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేటప్పటికి దొంగలు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలోని అపార్టుమెంట్‌లో యార్లగడ్డ సురేష్ నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి భీమడోలులో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చేటప్పటికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో వెండి వస్తువులు, రూ.వెయ్యి నగదు అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఫైర్ స్టేషన్ వద్ద అగ్నిమాపక వారోత్సవాలను సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ సోమవారం ప్రారంభించారు. చాలా అగ్ని ప్రమాదాలను నీటిని ఉపయోగించి నిరోధించవచ్చని, అదే నీటి వల్ల కొన్ని సార్లు ప్రమాద తీవ్రత పెరుగుతుందన్నారు. షార్ట్ సర్క్యూట్‌ల వల్ల జరిగే ప్రమాదాలను, గ్యాస్, పెట్రోల్ వల్ల జరిగే ప్రమాదాలలో నీటిని ఉప యోగించి నిరోధించడం ప్రమాదకరం అన్నారు. ప్రమాదాల నివారణలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ డి.ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపవరం ఎస్సీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

టీడీపీ నేత చొరవతో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా

ముసునూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గోపవరం ఎస్సీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. వారం రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి నీరు వచ్చే పైప్‌లైన్‌ల్లో సమస్య తలెత్తడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని వచ్చిందని కాలనీవాసులు చెబుతున్నారు. సమస్య పరిష్కారానికి పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి చర్యలు చేపట్టలేదని వారు మండిపడుతున్నారు. కనీసం తాగునీరు సౌకర్యాన్ని కూడా పంచాయితీ కల్పించలేని దుస్థితిలో ఉందని, అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వాసుల నీటి ఇబ్బందులను గుర్తించిన టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేశ్ ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. ఇప్పటికైన పైప్‌లైన్‌ల సమస్యను పరిష్కరించేలా జిల్లా పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.